క్లుప్తంగా

మీ కోసంకు 3 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో 3 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ టి.రవి తెలిపారు. పొజిషన్ సర్టిఫికెట్ కావాలని, వెబ్ ల్యాండ్ నుంచి పేరు తొలగించాలని, హక్కు కలిగిన భూమి వెబ్‌ల్యాండ్‌లో పేరు కనిపించడం లేదని అర్జీలు ఇచ్చినట్లు ఆయన వివరించారు. ఎంపీడీఓ డి.జయమణి, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, మత్స్య శాఖాధికారి ఎస్‌వీఎస్ వర్షిణి, ఏఓ సుధాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా పాల్గొన్నారు. గృహ నిర్మాణ శాఖ, ఇతర శాఖల అధికారులు వచ్చారే తప్ప కార్యక్రమం ముగిసే వరకు ఉండకుండా ముందే వెళ్లిపోయారు.

స్థలం కేటాయించాలని వినతి



ఆర్డీఓకు వినతి పత్రం అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మాణానికి స్థల కేటాయింపు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ సోమవారం ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు దాదాపు 50శాతంకు పైగా జనాభా ఉన్నారని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్థల కేటాయింపుకు చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు ఎస్‌కే ఖాశింసా, పులి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



అడుగడుగునా గుంతలతో అధ్వానంగా ఉన్న కంభం-కనిగిరి రహదారి



చిల్లచెట్లతో నిండి మూసుకుపోయిన పాపిరెడ్డిపల్లి, వాలిచర్ల రోడ్డు

అడుగుకో గుంత.. అడుగేసేదెట్లా..?

- అధ్వానంగా రహదారులు
- కనీస మరమ్మతులు చేయని వైనం
- అద్దాల్లాంటి రోడ్లంటూ అన్నీ అబద్ధాలే
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

హనుమంతునిపాడు: మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు, పంచాయతీ రహదారులు మోకాలి లోతు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. కంభం-కనిగిరి రహదారి వేములపాడు ఘాట్ రోడ్డు నుంచి కనిగిరి వరకు 27 కిలో మీటర్లు ఉంది. ఈ రహదారి డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు టెండర్లు పిలిచారు. అప్పట్లో కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ చిన్న చిన్న కల్వర్టులు కట్టి వదిలేశారు. ఇంకా కొన్ని కల్వర్టులు మిలిగి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లను అద్దాల్లా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికారు. కానీ ఈ రహదారిపై తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవు. దీంతో అడుగుకో గుంత పడటంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డు మొత్తం కుంటలు కుంటలుగా తలపిస్తోంది. రోడ్డు కనిపించదు. మార్జిన్లతో సహా రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గుంటలకు మట్టి వేయాలని ప్రజలు కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుపై అరగంట బస్సు ప్రయాణానికి గంటకు పైగా సమయం పడుతుందంటే రోడ్డు పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చిల్లచెట్లతో మూసుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి లేదు. ఎదురుగా వచ్చే వాహనాలకు సైడు ఇచ్చేందుకు కూడా మార్జిన్ లేదు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్లలో రాత్రిళ్లు ప్రయాణం చేయాలంటే జంకే పరిస్థితి నెలకొంది. పాపిరెడ్డిపల్లి, నందనవనం, పెద్దగొల్లపల్లి, రంగంపేట, హనుమంతాపురం, ఉమ్మనపల్లి, కొత్తూరు, రోడ్లు, గుడిపాటిపల్లి, కనిగిరి, తిమ్మారెడ్డిపల్లి, నల్లగండ్ల, వేములపాడు, నందనవనం రోడ్లు చిల్లచెట్లతో రోడ్లు కనిపించకుండా మూసుకుపోయాయి. ప్రయాణికులు భయాందోళనకు గురువతున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను, పిచ్చి చెట్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తిరునాళ్లలో నాయకులతో మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

మాటకు కట్టుబడే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ అన్నారు. మండల పరిధిలోని దొడ్డిచింతల గ్రామంలో జరిగిన బంగారమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం నాయకులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఇప్పటి వరకు ఒక్క పథకాన్ని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా సూపర్‌సిక్స్ పథకాలకు అతీగతి లేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు ఎస్ మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, బీజీ నాయకులు మద్ది తిరుపతయ్య, వెంకటకాశయ్య, సర్పంచ్ గాలం రామకృష్ణ, కొటపాటి మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురుప్రసాదు, యూత్ అధ్యక్షుడు భవనం కృష్ణారెడ్డి, బైనబోయిన కాటంరాజు, ఏరువ వెంకటరెడ్డి, టి.తిరుపతిరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న జయరావు కళాజాత బృందం

జరుగుమల్లి(సింగరాయకొండ): వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జయరావు కళాజాత బృందం పాటలు, నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని పోలేరమ్మ గుడి సెంటర్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సౌజన్యంతో జయరావు కళాజాత బృందంచే ఎయిడ్స్, టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ సోకిన వారి పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తే శిక్షార్హులని, ఎయిడ్స్ సోకిన వారు టోల్ ఫ్రీ నెంబరు 1097 కు ఫోన్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని వివరించారు.



కొండపి జెండా చెట్టు సెంటర్లో నిలిచిన వర్షం నీరు

కొండపిలో మోస్తరు వర్షం

కొండపి: మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు మోస్తారు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం మారి చల్లబడడంతో ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు ఉపశమనం పొందారు. సైడు కాలువలు లేకపోవడంతో ప్రధాన రహదారిలో నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొదిలి రోడ్డులోని స్టేట్ బ్యాంక్ దాటిన తర్వాత రోడ్డులో పూర్తిగా వర్షంనీటితో నిలిచిపోయింది. సచివాలయ సమీపంలో జెడా చెట్టు సమీపంలోని ఒక వీధిలో వర్షం నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలో 32.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈ వర్షం పండ్ల తోటలకు అనుకూలమని అధికారులు తెలిపారు.

సింగరాయకొండ: మండలంలో సోమవారం 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా ప్రధాన రహదారిపై నీరు నిలవటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం భూమి పదునెక్కడానికి అవకాశం ఉందన్నారు. మామిడి పంటకు వర్షం అనుకూలమని రైతులు తెలిపారు.

పొన్నలూరు: మండలంలో సోమవారం ఓమోస్తారు వర్షం కురిసింది. వేకువజాము నుంచే అడపాదడపా వర్షం పడటంతో గ్రామాల్లోని వాగులు, కుంటలు ఓ మోస్తారుగా జలకళను సంతరించుకున్నాయి. అలాగే బయట ఉన్న పొగాకు చెక్కులు, ఆరుబయట పోసిన మిరపకాయలు తడిచిపోయాయి. ఓ మోస్తారు వర్షానికి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వర్షం నీరు నిలిచిపోయి బురదమయంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం వలన పొగాకు, మిరప పంటలకు నష్టం చేకూరుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



పొన్నలూరులో తహసీల్దార్ కార్యాలయం దగ్గర...

తిరునాళ్లు ప్రశాంతంగా నిర్వహించాలి

సీఎస్‌పురం(పామూరు): పెద్దమ్మతల్లి తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ ఎం బీమానాయక్ అన్నారు. పెద్దమ్మతల్లి తిరునాళ్ల ప్రశాంతంగా నిర్వహించడంపై ఎస్సై ఆర్.సుమన్ అధ్యక్షతన ఆలయ కమిటీ, స్థానికులతో సమావేశం నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పడిపోతున్న లోగ్రేడ్ ధరలు

- ఆందోళనలో పొగాకు రైతులు.
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలంకేంద్రంలో లో గ్రేడ్ పొగాకు ధరలు రోజు రోజుకు పడిపోతున్నాయి. 2024-25 సీజన్‌కు సంబంధించి పొగాకు వేలాన్ని ఏప్రిల్ పదో తేదీన ప్రారంభించారు. ప్రారంభ రోజు పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.260 నమోదైంది. అయితే నాల్గవ రౌండ్ వేలం చివరి దశకు వచ్చేసరికి కనిష్ట ధర రూ.203గా నమోదైంది. రోజు రోజుకు ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలానికి తీసుకువచ్చిన బేళ్లలో నిత్యం వందలాది బేళ్లను తిరస్కరిస్తుండటంతో బేళ్లను మరొకసారి వేలానికి తీసుకురావడానికి ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరగడంతో అప్పులు చేసి పొగాకు సాగు చేశారు. వేలంలో ఆశించిన మద్దతు ధర పలికి పెట్టుబడి ఖర్చులు వస్తాయనే ఆశతో రైతులు ఉండగా, ధరలు తగ్గడంతో రైతులు ఆశలు అడియాశలవుతున్నాయి. పొగాకు బోర్డు అధికారులు బయ్యర్లతో సంప్రదింపులు చేసి ఎక్కువ ధరకు పొగాకును కొనుగోలు చేయాలని రైతుల తరపున మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు. అధికారులు మొక్కుబడిగా వేలం కేంద్రాలకు పరిశీలనకు వచ్చి వెళుతున్నారే తప్ప రైతుల గోడు ఆలకించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనిష్ట ధర రూ.203

స్థానిక పొగాకు వేలంకేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ. 203 పలికిందని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అనకర్లపూడి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 800 బేళ్లను వేలానికి తీసుకురాగా 573 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 227 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.241.68గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: : స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో పొగాకు సరాసర ధర రూ. 246. 45 నమోదైంది. వేలం కేంద్రానికి కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు వేలానికి 741 బేళ్లను తీసుకురాగా 607 బేళ్లను కొనుగోలు చేసి 134 బేళ్లను తిరస్కరించారు. వేలంలో 23 కంపెనీలు పాల్గొన్నాయని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్‌కుమార్

పేదల పక్షపాతి
పుచ్చలపల్లి సుందరయ్య



టంగుటూరులో సుందరయ్య చిత్రపటానికి నివాళులు

పామూరు: సుందరయ్య పేదల పక్షపాతి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్థంతి సభ సోమవారం స్థానిక సుందర య్య భవన్‌లో సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా అధ్యక్షతన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ సుందరయ్య ఆశయాలు అనుసరణీయమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కొమ్మలపాటి మాల్యాద్రి, షేక్.అల్లాబక్షు, మహబూబ్‌పీరా, సీహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: పుచ్చలయ్యపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన గొప్ప నాయకుడు సుందరయ్య అని తెలిపారు. సీపీఎం నాయకులు జి. శ్రీనివాస్, టి.రాము, వి. మోజెస్, టి.సుబ్బారావు, టి.నారాయణరావు, టి.రామ్మూర్తి, ఎం. యానాది, బుడే సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): కార్మికులు, కష్టజీవుల సంక్షేమంకోసం పనిచేసిన సుందరయ్య ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని సీపీఎం సీనియర్ నాయకుడు సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో సోమవారం సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, బీజే రత్నం, దోల తిరుపతయ్య, ఏసుదాసు, నారయ్య, నారాయణరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.50 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,50,954 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.86,910, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.37,820, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.53,576, మహాప్రాకార నిర్మాణానికి రూ.55,616, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.11,032, శ్రీపాద కానుకలద్వారా రూ.6 వేలు వచ్చినట్లు తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి పామూరు మండలం చిలంకూరు గ్రామానికి చెందిన కాకనూరి చిన్నవెంకటేశ్వర్లు, గురమ్మలు రూ.41,116 విరాళాన్ని ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణకు అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



ప్రతిష్టా మహోత్సవ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న గ్రామస్తులు



స్వామి విగ్రహ పత్రిష్టలో పాల్గొన్న డాక్టర్ వెంకయ్య

పొన్నలూరు: మండలంలోని చెరుకూరులో నూతనంగా నిర్మించిన మల్లేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం దుర్గా మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, పరివారి దేవతల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గూడా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంతో వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం మల్లేశ్వర స్వామి, పార్వతిదేవి విగ్రహాలను పూలతో అందంగా అలంకరించి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. మహోత్సవంలో పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొని స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పామూరు: మండలంలోని తిరగలదిన్నెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మేధా దక్షిణామూర్తి, విష్ణుమూర్తి, భక్తాంజనేయస్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన విగ్రహప్రతిష్ట, జీవధ్వజ, శిఖర ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం రుత్వికుల వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, గణపతిహోమం మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనులపండువగా గంగాభవానీ గ్రామోత్సవం



గంగాభవానీ గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న నేతలు



విశిష్ట అలంకారములో గంగాభవాని ఉత్సవమూర్తి, బొల్లావులు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న గంగాభవానీ వార్షిక తిరునాళ్లలో భాగంగా రెండో రోజు సోమవారం గంగాభవానీ ఉత్సవమూర్తిని గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ గ్రామోత్సవం మోపాడు, మోపాడు బంగ్లా, కొండారెడ్డిపల్లె గ్రామాల్లో నిర్వహించారు. ముందుగా గంగాభవానీ అమ్మవారి మూల విగ్రహమూర్తికి అర్చకులు పంచామృతాభిషేకం, కుంకుమపూజతో పాటు విశిష్ట పూజలు చేశారు. ఆలయప్రాంగణంలో బొల్లావులకు ప్రత్యేకపూజలు గాంచారు.

13 మంది గైర్హాజరు

సింగరాయకొండ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో మొదటి రోజు 13 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి రామారావు తెలిపారు. తెలుగు పరీక్షకు 42 మందికి గాను 30 మంది, సంస్కృతం పరీక్షకు 4 గురికి గాను ముగ్గురు హాజరయ్యారని ఆయన వివరించారు.

జమ్ములపాలెంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలో వేంచేసిన అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 వరకు జరగనున్నాయి. 20న ధ్వజారోహణ, సింహ వాహనం, 21న భృంగి వాహనం, 22న రావణసేవ, 23న నందిసేవ, 24న గజ వాహనం, 25 ఉదయం కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి రథోత్సవం, 26న ఉదయ వసంతోత్సవం, సాయంత్రం గుర్రం వాహనం, రాత్రికి ధ్వజారోహణ, 27న రాత్రికి ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు అర్చకులు మోహన్‌రావు తెలిపారు.

హనుమాన్ శోభాయాత్రకు ఆహ్వానం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను హనుమాన్ శోభయాత్ర కమిటీ సోమవారం ఆహ్వానించారు. ఈనెల 22న కనిగిరిలో జరిగే హనుమాన్ శోభ యాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వద్దిపాటి వెంటేష్, కోడూరి పెద్దిరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి బొగ్గవరపు నవీన్, గంజి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

టంగుటూరు: రైతులు రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుము, జీలుగ , పిల్లిపెసర 50 శాతం రాయితీపై, నువ్వులు 40 శాతం రాయితీపై ఇస్తామన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జీఓ నంబర్.4పై పునరాలోచించాలి

కొండపి: ప్రభుత్వం జీఓ నంబర్.4పై పునరాలోచించాలని మండల రెవెన్యూ అధికారుల సంఘం సోమవారం తహసీల్దార్ మురళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సంఘ నాయకులు మాట్లాడుతూ ఒక సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేలాగా నిర్ణయం తీసుకోవాని, లేకుంటే 2019 ముందు వరకు ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో ఒక రెవెన్యూ విలేజీకి ఒక వీఆర్‌ఓ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల ఒంగోలు డివిజన్ కార్యదర్శి గంగవరపు శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.